కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హెల్త్ సెక్రటరీలు, నాయకులు

ముగిసిన లాటరీ.. మొదలైన బేరాలు

- పూర్తయిన ప్రయివేటు మద్యం దుకాణాల కేటాయింపు

- దుకాణాలు కొనేందుకు మొదలైన బేరసారాలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు మద్యం దుకాణాల కేటాయింపు పూర్తయింది. కర్నూలు జిల్లాలో 99 దుకాణాలకు, నంద్యాల జిల్లాలోని 105 దుకాణాలకు సోమవారం లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. దుకాణాన్ని దక్కించుకున్న వారు సంతోషపడ్డారు. ఆ సంతోషం ఎక్కువ కాలం ఉండటం లేదు. ఆయా ప్రాంతంలో పలుకుబడి ఉన్న ప్రజా ప్రతినిధులు, గతంలో పలు సార్లు మద్యం వ్యాపారం చేసిన వారు బేరసారాలు మొదలు పెట్టారు. పలానా దుకాణాన్ని ఎవరు దక్కించుకున్నారో తెలుసుకుని వారిని వచ్చి తమను కలవమని ఆదేశాలు జారీ చేశారు. తమ వద్దకు వచ్చిన వారితో బేరాలు మొదలు పెట్టారు. కొంత మొత్తాన్ని ఇస్తామని దుకాణం తమకు అమ్మేయాలని హుకుం జారీ చేస్తున్నారు. దుకాణాన్ని దక్కించుకోవడం కోసం కొంత మంది వ్యాపారులు ఒక్కో దుకాణానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఆఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దుకాణాన్ని దక్కించుకుని తాము పిలిచినా రాని వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. కర్నూలు జిల్లాలోని ఓ నియోజకవర్గంలో దుకాణాన్ని దక్కించుకున్న టిడిపియేతరులు దుకాణాన్ని తమకు అమ్మకపోతే దుకాణాన్ని నడపనివ్వబోమని ఎమ్మెల్యే అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. మరో నియోజకవర్గంలో ఎవరు మద్యం దుకాణాన్ని నడిపినా ఎమ్మెల్యే, షాడో ఎమ్మెల్యేకు కలిపి 30 శాతం వాటా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు, కూటమి నాయకులు మాత్రమే టెండరు వేసేలా చర్యలు తీసుకోవడంతో దుకాణాలన్నీ వారికే దక్కాయి.

కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలకు మొత్తం 3046 దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. ఆ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రారంభించారు. అనంతరం లాటరీ ప్రక్రియను జెసి డాక్టర్ బి.నవ్య నిర్వహించారు. ఆమె లాటరీలు తీసి దుకాణాలను దక్కించుకున్న వారి వివరాలను వెల్లడించారు. 34వ దుకాణానికి మొత్తం 99 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ షాపును సుగాలి లక్ష్మీదేవి లాటరీ ద్వారా దక్కించుకుంది. 35వ దుకాణాన్ని కూడా ఆమే దక్కించుకోవడం విశేషం. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పద్ధతి ప్రకారం లాటరీ ప్రక్రియ నిర్వహించినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 31, కోడుమూరు పరిధిలోని 14, ఎమ్మిగనూరు పరిధిలోని 15, ఆదోని పరిధిలోని 12, కోసిగి పరిధిలోని 04, ఆలూరు పరిధిలోని 09, పత్తికొండ పరిధిలోని 14 మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంఛార్జి డిఆర్ఓ చిరంజీవి, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, కర్నూలు ఆర్‌డిఓ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ద్వారా డిప్ తీస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

హెల్త్ సెక్రటరీలను

వైద్య శాఖకు బదలాయించాలి

- కలెక్టరేట్ ఎదుట హెల్త్ సెక్రెటరీ అసోసియేషన్ ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖకు బదలాయించాలని యునైటెడ్ విలేజ్, వార్డ్ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంధ్యారాణి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. యునైటెడ్ విలేజ్, వార్డ్ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి అధ్యక్షత వహించారు. ఎండి అంజిబాబు మాట్లాడుతూ సీనియార్టీ లిస్టును తయారు చేసి ఎంఎహెచ్ఏ (ఎఫ్)లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుండి మినహాయింపులు ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 152 ప్రకారం మెటర్నిటీ లీవును డెలివరీ తేదీ నుండి కాకుండా వారు అప్లై చేసిన తేదీ నుండి శాంక్షన్ చేయాలని కోరారు. ఆరోగ్య కార్యకర్తలు ఉద్యోగంలో చేరినప్పటి నుండి ట్రెజరీ వారి అభ్యంతరాలతో సరెండర్ లీవ్ పొందలేకపోయా రని, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం ట్రెజరీ వారికి తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. యూనిఫామ్ అలవెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఓకు, డిఎంహెచ్ఒకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సిహెచ్ సాయిబాబా, అసోసియేషన్ జిల్లా నాయకులు వరలక్ష్మి, దేవి, మాన్విత, శంషాద్, సరోజమ్మ, మేరీ, హేమావతి, పద్మ పాల్గొన్నారు.

ఫిర్యాదులకు చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ తెలిపారు. సోమవారం కర్నూల్‌లోని ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను ఎస్‌పి స్వీకరించారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 48 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐ మధుసుధన్ రావు పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వం

- అక్టోబర్ 15 వచ్చినా పూర్తిగా పంపిణీ చేయని శనగ విత్తనం

- పేరుకు మాత్రమే 25 శాతం సబ్సిడీ - బహిరంగ మార్కెట్ ధరతోనే ఇస్తున్న పరిస్థితి

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరించిందని, రబీ సీజన్ ప్రారంభమై అక్టోబర్ 15 వచ్చినా నేటికి శనగ విత్తనాన్ని పూర్తిగా పంపిణీ చేయడంలో విఫలమైందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గడిచిన ఐదేళ్లల్లో ఎన్నడూ కూడా రైతులకు ఇంత ఆలస్యంగా శనగ విత్తనం పంపిణీ చేయలేదన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 15 వచ్చినా శనగ విత్తనం పంపిణీ చేయకపోవడం రైతులపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తుందని అన్నారు. క్వింటా రూ. 9 వేలు ప్రకటించి సబ్సిడీ 25 శాతం పోనూ క్వింటా రూ.7,050లకు ఇస్తున్నారని అన్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో శనగ విత్తనం ధర క్వింటా రూ.7100లుగా ఉందన్నారు. బహిరంగ మార్కెట్‌లో నాణ్యతతో ఇదే ధరకు విత్తనం వస్తుంటే ప్రభుత్వం మాత్రం సబ్సిడీ ఇస్తున్నామని గొప్పలు చెప్తూ అదే ధరకు అందించడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీతో శనగ విత్తనాన్ని అందించిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం ఇచ్చే విత్తనంలో కూడా నాణ్యత గాలికొదిలేసిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యవసాయ అధికారులతో మాట్లాడగా కర్నూలులో కొన్ని మండలాల్లో ఇచ్చామని, నంద్యాల జిల్లాలో నందికొట్కూరులో పంపిణీ చేసినట్లు తెలిపారన్నారు. కానీ క్షేత్ర స్థాయిలో ఎంత మేర జరిగిందో జగమెరిగిన సత్యం అందరికీ తెలుసన్నారు. ఖరీఫ్ సాగు పూర్తి అయినా నేటికి రైతులకు పెట్టుబడి సాయం ప్రకటించిన 20 వేల రూపాయలు అందించడంలో దారుణంగా విఫలం చెందిన ప్రభుత్వం ఇదేనన్నారు. కనీసం ఇప్పటికైనా రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం, సబ్సిడీ శనగ విత్తనాన్ని పూర్తి స్థాయిలో అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్

పల్లె పండగ ద్వారా

రూ. 82 కోట్లతో1562 పనులకు శ్రీకారం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

- గొందిపర్లలో అభివృద్ధి పనులకు కలెక్టర్, ఎమ్మెల్యే భూమి పూజ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పల్లె పండగ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా రూ.82 కోట్లతో 1562 పనులకు శ్రీకారం చుట్టామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఇందిరమ్మ కాలనీలో మంజూరైన రోడ్లు, డ్రైయిన్లు తదితర అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండగ కార్యక్రమం ద్వారా రూ.4500 కోట్లతో 30 వేలకు పైగా పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో రూ. 82 కోట్లతో 1562 అభివృద్ధి పనులను చేపట్టనున్నామని అన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో రూ. 12.65 కోట్లతో, కర్నూలు మండలంలో రూ. 4.28 కోట్లు, గొందిపర్ల గ్రామంలో రూ.41.62 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు..గొందిపర్ల గ్రామంలో రూ.14 లక్షలతో 8 ఫామ్ పాండ్స్, రూ.6.15 లక్షలతో ఫీల్డ్ చానల్స్, రూ.12 లక్షలతో సిసి రోడ్స్, రూ. 4.6 లక్షలతో గోకులాలు, ఇతర పనులకు రూ.4 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొదటి దశలో ఈ పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద మళ్లీ ఏప్రిల్ నెలలో కూడా కొత్తగా పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు. ఇలా నిరంతరంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామ సభలు నిర్వహించుకొని ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.. గ్రామాలకు రోడ్లు అవసరం కాబట్టి మొదటి దశలో ముందుగా రోడ్ల నిర్మాణంతో పాటు గోకులాలను కూడా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రెండవ దశలో డ్రైయిన్స్ పూర్తి చేస్తామన్నారు. గ్రామాభివృద్ధికి ఇంకా అవసరమైన పనులు ఏమైనా ఉంటే ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే వాటిని కూడా చేపడతామన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇద్దరు కలిసి పల్లెలను అభివద్ధి చేసేందుకు రాష్ట్రమంతటా అనేక అభివద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని, ఇప్పటికీ కూడా అభివృద్ధి చేసుకోలేకపోతే భావితరాల భవిష్యత్తు నాశనం అయిపోతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో పల్లెలను అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కొకటిగా పథకాలను అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పథకం కూడా ముఖ్యమంత్రి అంద జేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం రావడం వల్ల తిరిగి రాష్ట్రాన్ని పునర్నిర్మించు కోవడానికి మంచి అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, పంచాయితీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డిపిఓ భాస్కర్, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గొందిపర్ల గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కలెక్టర్ రంజిత్ బాషా

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

'పల్లె పండగ'ను విజయవంతం చేద్దాం

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పర్చుకునేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండగ'ను విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి కోరారు. సోమవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ బిటి.నాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వై.నాగేశ్వరరావుయాదవ్, వలసల రామకృష్ణుడుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని గత జగన్ ప్రభుత్వం పూర్తి విస్మరించి, డ్రైనేజ్, వీదీ దీపాలు వంటి వాటిని కూడా వేసుకోలేని స్థితిలోకి నెట్టిందన్నారు. అలాగే 14, 15వ ఫైనాన్స్ కమిషన్ వారు విడుదల చేసిన నిధులను కూడా జగన్ ప్రభుత్వం దారి మళ్లించి గ్రామాలు కనీసం పరిశు భ్రతకు, వీధి లైట్లకు కూడా నోచుకొని విధంగా నిర్వీర్యం చేసి సర్పంచులను, ఎంపిటిసి సభ్యులను ఉత్సవ విగ్రహాలుగా మార్చివేశారనీ, అందుకే ప్రజలు జగన్‌కు బుద్ధి చెప్పి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని తెలిపారు. టిడిపి నాయకులు రెడ్డిపోగు బజారన్న, పెండ్యాల భరద్వాజశెట్టి, ఎస్.షేక్షావలి, బుర్రా ఈశ్వరయ్య, అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

వడ్లవోని వంక సమస్యపై స్పందించాలి

- డిఆర్‌ఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో వడ్లవోని వంక భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వాళ్లు ఆక్రమించుకొని ప్లాట్లు వేయడం వల్ల, దళితుల ఇళ్లలోకి నీళ్ళు వస్తున్నాయని, కలెక్టర్ జోక్యం చేసుకొని వంక నుండి నీళ్ల పోయే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం మండల కార్యదర్శి మధు, పెద్దపాడు గ్రామ శాఖ కార్యదర్శి గోపితో కలిసి డిఆర్ఒ చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ... దళిత కాలనీలో సుమారు 130 ఇళ్లు నీట మునిగాయని, ఎలిమెంటరీ స్కూలు మైదానంలోకి మోకాళి లోతు నీళు వస్తున్నాయని తెలిపారు. అక్కడ బాలుర హాస్టల్‌లోకి కూడా నీళ్ల వచ్చాయని తెలిపారు. ఈ విషయమై ఈ ఏడాది ఆగస్టు 19న కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని, కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారని, ఇరిగేషన్ వాళ్లు పరిశీలన చేసి రిపోర్టు ఇచ్చారని, మరొకసారి ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఉన్నతాధికారులు సమస్య పరిష్కారం చేయాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. డిఆర్ఒ చిరంజీవి స్పందిస్తూ వంకను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, వంక నుండి పోవాల్సిన నీళ్ల యధావిధిగా పోయేటట్టు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే శ్యాంబాబు

ప్రజాశక్తి - పత్తికొండ

కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు తెలిపారు. సోమవారం మండలంలోని చెక్కరాళ్ల దూదేకొండ, పత్తికొండలోని షాదీఖానా రోడ్డులో 'పల్లె పండగ'లో ఎమ్మెల్యే శ్యాంబాబు పాల్గొన్నారు. చెక్కరాళ్ల గ్రామంలో సిసి రోడ్డును ప్రారంభించారు. అలాగే చెక్కరాళ్ల, దూదేకొండ, పత్తికొండలో దాదాపు రూ.30 లక్షలతో సిసి రోడ్లకు భూమి పూజ చేశారు. చెక్కరాళ్ల గ్రామంలో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో పాటు డిజిటల్ క్లాసులను వీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసిపి ప్రభుత్వం గ్రామాలకు నిధులు ఇవ్వకపోగా కేంద్రం ఇచ్చిన నిధులు కూడా దోచేసిందని విమర్శించారు. ఎంపిటిసి రాజు, టిడిపి నాయకులు ముని నాయుడు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : మండలంలో నిరుద్యోగుల కోసం స్కిల్ కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. సోమవారం ఓర్వకల్లులో 'పల్లె పండగ' నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరిత్ర రెడ్డి పాల్గొని ఉపాధి నిధుల రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలానికి రూ.2.31 కోట్లు మంజూరయ్యాయని, వీటితో గ్రామాల్లో సమస్యలు గుర్తించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇక్కడ ఏర్పడుతున్న పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు వచ్చేలా చూస్తామని చెప్పారు. పాణ్యం పిఆర్ ఇఇ నాగిరెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి సుబ్బరాయుడు, పిఆర్ ఎఇ సురేంద్ర నాథ్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, లొద్దిపల్లె పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బాధితుల నుంచి అర్జీల స్వీకరణ : ఓర్వకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి బాధితుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపిపి తిప్పన, జడ్‌పిటిసి రంగనాథ్ గౌడ్, తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఒ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు (హాస్పిటల్) : కల్లూరు మండలం ఉలిందకొండ, యాపర్లపాడు, ఎర్రకత్వ, కొల్లంపల్లి తండా గ్రామాల్లో సిసి రోడ్లకు భూమి పూజ చేశారు. ఎపి ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, ఎంపిడిఒ ఎన్ఎస్.రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ దీప్తి, ఇఒఆర్‌డి నగేష్, ఎపిఒ మద్దేశ్వరమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సతీష్, పిఆర్ ఎఇ రవి మోహన్ రెడ్డి, ఉలిందకొండ సీనియర్ నాయకులు ఇవి.రమణ, ఐటిడిపి పాణ్యం నియోజకవర్గ అధ్యక్షులు రమణ, రంగారెడ్డి, రంగస్వామి రెడ్డి, కలాం, ఇ.శ్రీకాంత్, కరీం, నరేంద్ర, మద్దయ్య, రవి నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు. **సిబెళగల్** మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి గ్రామాల్లో ఎంపిడిఒ రాణెమ్మ సోమవారం 'పల్లె పండగ' నిర్వహించారు. నాలుగు సిసి రోడ్లకు రూ.16 లక్షలు కేటాయించి భూమి పూజ చేశారు. ఉపాధి ఎపిఒ రామన్న, జెఇ రంగస్వామి, పంచాయతీ ఎఇ ప్రకాష్, ఎంపిటిసి ఉమామహేశ్వరమ్మ, గ్రామ పెద్దలు రాఘవేంద్ర, జక్రియ, సోమప్ప పాల్గొన్నారు. **వెల్దుర్తి** మండలం అల్లుగుండు, బింగిదొడ్డి, బోగోలు గ్రామలలోపల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ సుహాసినమ్మ, విస్తరణ అధికారి రవి కిషోర్, ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.

పత్తికొండలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

కళాశాలకు కీర్తిప్రతిష్టలు వచ్చేలా చదవాలి

- ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కళాశాల కీర్తిప్రతిష్టలు కొనసాగించేలా చదవాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. సోమవారం 2024-25 సంవత్సరానికి అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండు వారాల ఫౌండేషన్ కోర్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు అభినందనలు తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, హాజరు శాతం 75 శాతానికి తగ్గకుండా ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల గురించి నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకు రావాలని, సీనియర్ ప్రొఫెసర్ల బృందం వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... వైద్య విద్య ఎంతో ఉన్నతమైందని, ఎంతో మంది సీనియర్ వైద్యులకు వైద్య విద్య అందించిన కళాశాల కెఎంసి అని తెలిపారుర. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ రేణుక, డాక్టర్ విజయానంద్ బాబు, హాస్టల్ ఇన్‌ఛార్జీలు ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమశేఖర్, ఎంఇయు కోఆర్డినేటర్ డాక్టర్ సింధియా శుభప్రద పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

పిహెచ్‌సిలలో 'పెంటా' కొరత లేకుండా చూడాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పిహెచ్‌సిలలో పెంటా వ్యాక్సిన్ కొరత లేకుండా చూడాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ కోరారు. సోమవారం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా నాయకులు అబ్దుల్లాతో కలిసి జిల్లా వైద్య కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా అనేక పిహెచ్‌సిలలో పెంటా వ్యాక్సిన్ల కొరత ఎక్కువగా ఉందని తెలిపారు. చిన్నపిల్లలకు మూడు రకాలుగా వ్యాక్సిన్లు వేస్తారని, అందులో ప్రధానమైన వ్యాక్సిన్ పెంటా వ్యాక్సిన్ అని చెప్పారు. ఆ వ్యాక్సిన్ ద్వారా కంఠసరిపి, దామర, హెపటైటిస్ లాంటి వ్యాధులను నివారించవచ్చని అన్నారు. అలాంటి వ్యాక్సిన్ 3, 4 నెలల నుంచి అందుబాటు లో లేకపోవడం బాధాకరమని తెలిపారు. పిల్లల మెరుగైన జీవితానికి వ్యాక్సిన్లు ఎంతో ముఖ్యమని, వ్యాక్సిన్లు తెప్పించి అన్ని పిహెచ్‌సిలలో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనకు దిగుతామని తెలిపారు.

వైద్య కళాశాల పనులను ప్రారంభించాలి

ప్రజాశక్తి - పత్తికొండ

ఆదోనిలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను ప్రారంభించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. సోమవారం పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు శ్రీనివాసులు, వీరేష్, తిరుమలేష్, సోమశేఖర్, రమేష్, ఉదయ్, వినోద్ మాట్లాడారు. వైద్య కళాశాల పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ఈఏడాది ప్రారంభం కావాల్సిన అడ్మిషన్లు నిలిచిపోయాయని తెలిపారు. పనులు పూర్తయితే పశ్చిమ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

బీడీ వర్కర్స్ కాలనీలో వసతులు కల్పించాలి : ఆవాజ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

బీడీ వర్కర్స్ కాలనీలో వసతులు కల్పించాలని ఆవాజ్ నగర కార్యదర్శి ఎస్ఎండి.షరీఫ్ కోరారు. సోమవారం కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలోని జొహరాపురం 19వ వార్డు పరిధిలో గల బీడీ వర్కర్స్ కాలనీలో సిసి రోడ్లు, కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న పిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఈ రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగి విష పురుగులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కమిషనర్ స్పందిస్తూ... ఒకసారి బీడీ వర్కర్స్ కాలనీని సందర్శిస్తామని, సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఆవాజ్ నాయకులు షేక్ అబ్దుల్ నయీమ్, షేక్ సయ్యద్ అహ్మద్, చోటు భాయ్, నాయకులు మహబూబ్ బాషా, కాలనీవాసులు ఎమ్‌డి.నబి, అహ్మద్, అన్వర్ బాష, అబ్దుల్ రసూల్, దావూద్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు గ్రామ సమస్యలు పరిష్కరించండి : వ్యకాస

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు గ్రామ సమస్యలను పరిష్కరించాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని గ్రామస్తులు శ్రీరాములు, మున్నా, సురేష్‌లతో కలిసి వినతిపత్రం అందజేశారు. నాగన్న మాట్లాడుతూ... పదేళ్ల క్రితం ఓర్వకల్లు మండలాన్ని పరిశ్రమల హబ్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. ఈ ప్రాంతంలో వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు చేశారని, ఓర్వకల్ మండలం అభివృద్ధి దిశగా కొనసాగుతోందని తెలిపారు. గ్రామంలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గ్రామంలో సిసి రోడ్ల, కాలువలు ఏమాత్రం వేయలేదని విమర్శించారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మద్దిలేటి, బాలమద్దిలేటి పాల్గొన్నారు.

దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - సిబెళగల్

బెళగల్‌లో గల దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు సోమవారం గంధంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉరుసు అని, బుధవారం కిస్తీ ఉంటుందని ఆలయ పెద్దలు తెలిపారు. అలాగే వచ్చే భక్తులకు ఉచిత అన్నదానం ఉంటుందని, సౌకర్యాల కొరత రానివ్వమని చెప్పారు.

ప్లాస్టిక్ అమ్మకందారులపై దాడులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్లాస్టిక్ వాడకంపై నిషేధం ఉండి కూడా ప్లాస్టిక్ అమ్మకాలు నిర్వహిస్తున్న దుకాణాలపై మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న వివిధ షాపుల్లో దాడులు నిర్వహించి పలు దుకాణదారులకు రూ.10 వేల అపరాధ రుసుం విధించారు. డిఇ నీరజ, ఎఇ శరత్ చంద్ర, మదన్ కుమార్ పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ తనిఖీ : పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న అన్నక్యాంటీన్ భోజన పంపిణీని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తనిఖీ చేశారు. డిఇ నీరజ, ఎఇ మదన్ కుమార్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలను పూర్తి చేయాలి

- ఎమ్మెల్యేకు విద్యార్థి, యువజన సంఘాల వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని మండలం ఆరెకల్లు గ్రామ సమీపంలో 167ఎ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులు పూర్తి చేయాలని విద్యార్థి, యువజన సంఘాల జెఎసి నాయకులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాల పనులను నిర్లక్ష్యం చేయడం వల్ల పనులు పూర్తి చేయలేకపోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేసి ఈ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం, విద్య అందించేలా చొరవ చూపాలని కోరారు. జెఎసి నాయకులు వీరేష్, అబంద, సోమశేఖర్, రమేష్, ఉదయ్, గౌస్ పాల్గొన్నారు.

పౌర హక్కుల నేత సాయిబాబాకు నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

ప్రముఖ విద్యావేత్త, పౌర హక్కుల నేత ప్రొఫెసర్ జిఎన్.సాయిబాబా మృతి పట్ల పట్టణంలో వామపక్ష నాయకులు నివాళి అర్పించారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ, పౌర హక్కుల సంఘం, పెన్షన్ దారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సిపిఎం నాయకులు గోవిందు, సిపిఐ నాయకులు రంగన్న నేతృత్వంలో సోమప్ప సర్కిల్‌లో నివాళులర్పించారు. సాయిబాబా పేద సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలను వివరించారు.

డ్రెయినేజీ కల్వర్టు నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కల్వర్టును చూపుతున్న సిపిఎం నాయకులు

పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో కూలిన మెయిన్ డ్రెయినేజీ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని సిపిఎం పట్టణ నాయకులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం బృందం కల్వర్టును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కల్వర్టు కూలి రెండు నెలలు కావస్తున్నా నిర్మించకపోవడం శోచనీయమని తెలిపారు. కూలిన కల్వర్టు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. అధికారులు కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు ఎం.అబ్దుల్ల, యు.రమేష్, కె.సుభాన్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి : ఎస్టియు

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఎస్టియు పట్టణ అధ్యక్షులు కె.రవి డిమాండ్ చేశారు. సోమవారం నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల దాచుకున్న డబ్బు నుంచి పిఎఫ్ లోన్స్, ఎపిజిఎల్ఐ ఫైనల్ పేమెంట్స్, సంపాదిత సెలవుల నగదు మంజూరు చేయాలని కోరారు. మెడికల్ బిల్స్ అన్ని ఎక్కడ్ చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. ఎస్టియు ఆదోని సీనియర్ నాయకులు లక్ష్మానాయక్ మాట్లాడుతూ... ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్టియు రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు మాట్లాడుతూ... మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్టియు రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, నాయకులు ప్రహ్లాద, సుధాకర్ బాబు, ఖలీల్, జుబీర్, ప్రసాద్, విజయ్, ఉరుకుందప్పు, మారయ్య, శ్రీరాములు, నిరంజన్ రెడ్డి, జయరాముడు ఉన్నారు.

గ్రామాలాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ఆదోనిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సేవలందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. సోమవారం మండలంలోని బైచిగేరి గ్రామంలో 'పల్లె పండగ' వారోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం గ్రామాల పాలనను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ఇటీవల రూ.2 కోట్లకు పైగా నిధులను విడుదల చేసిందని గుర్తు చేశారు. విడతల వారీగా మరిన్ని నిధులు రాబోతున్నాయని తెలిపారు. సర్పంచి మహాదేవ, పిఆర్ ఇఇ వెంకటేశ్వర్లు, డిఇ రాణి, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఇఒఆర్‌డి జనార్ధన, ఇన్‌ఛార్జి ఎపిఒ కాలిక్, ఎఇ మాలిక్ పాల్గొన్నారు.

వేదికపై దళిత అధికారులకు వివక్ష

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన 'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా బైచిగేరిలో ఏర్పాటు చేసిన సభలో దళిత అధికారులపై వివక్ష చూపారు. ముందు వరుసలో ఎలాంటి హోదాలు లేకున్నా మాజీ ఎంపిపి పంపాపతి, నీలకంఠ, విట్టా రమేష్, మల్లప్ప, కృష్ణమ్మ కూర్చున్నారు. పిఆర్ డిఇ రాణి, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ దళిత అధికారులు కావడంతో వెనక వరుసలో కూర్చున్నారు. అధికారులపై ఇంత వివక్ష చూపిస్తున్నారని గ్రామస్తులు చర్చించుకున్నారు.

కౌతాళం : కూటమి ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య తెలిపారు. సోమవారం 'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కౌతాళంలోని ఎన్‌టిఆర్ నగర్ కాలనీలో రూ.10 లక్షలతో డ్రెయినేజీతో పాటు సిసి రోడ్డు, శివప్ప నగర్‌లో రూ.15 లక్షలతో డ్రెయినేజీతో పాటు సిసి రోడ్డు, పొదలకుంట గ్రామంలో రూ.9 లక్షలతో, కాత్రికి గ్రామంలో రూ.10 లక్షలతో డ్రెయినేజీతో పాటు సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో రోజుల నుంచి గ్రామాలు అభివృద్ధి లేక వెలవెలబోతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాకతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్తామన్నారు. టిడిపి నాయకులు అడివప్ప గౌడ్, చౌదరి బసవరాజు, గిరి, ముకయ్య, కృష్ణ, శివమూర్తి, గోపాల్, మాలపల్లి లక్ష్మన్న, తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపిడిఒ సుబ్బరాజు, ఎపిఒ శంకర్, పిఆర్ ఎఇ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివప్ప పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని దేవనకొండ, కుంకనూర్ గ్రామాల్లో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ పర్యటించి ఆయా గ్రామాల్లో రూ.10 లక్షతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు రంగ లక్ష్మి, ఈరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, తహశీల్దార్ లోకేశ్వరయ్య, ఎంపిడిఒ గౌరీదేవి, ఇఒఆర్‌డి సూర్యనారాయణ, జనసేన ఆలూరు ఇన్‌ఛార్జి తెర్నేకల్ వెంకప్ప, టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, ఈదుల దేవర బండ సుభాన్, తెలుగు యువత ఆలూరు అధ్యక్షులు రాజాసాబ్, నాయకులు మాల బండ్లయ్య, సుభాన్, బిజెపి నాయకులు రవి, బొల్లెద్దుల కిరణ్ కుమార్, జనసేన పార్టీ నాయకులు నందు, జగదీష్ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం చిలుకలడోణ, కలుదేవకుంట గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మానానికి భూమి పూజ చేశారు. టిడిపి యువ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి మాట్లాడారు. ఈనెల 14 నుంచి 20 వరకు 'పల్లె పండగ' ద్వారా రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, మరో రూ.కోటి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం చిలుకలడోణ గ్రామంలో 3 సిసి రోడ్ల ఏర్పాటుకు ఒక్కో రోడ్డుకు రూ.5 లక్షల చొప్పున ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.15 లక్షలు, కలుదేవకుంట గ్రామంలో 2 రోడ్లకు రూ.10 లక్షల చొప్పున మంజూరయినట్లు చెప్పారు. టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి, టిడిపి చిలుకలడోణ గ్రామ యువ నాయకులు తిక్కయ్య, సర్పంచి గుజ్జల నాగమ్మ, ఎంపిటిసి ఆకుల లక్ష్మి, మాజీ సర్పంచి మాదప్ప, కలుదేవకుంట గ్రామ నాయకులు రాఘన్న, మల్లప్ప, భీమయ్య, డిసి.తిమ్మప్ప, చేపల నాగేష్, మండల ప్రత్యేకాధికారి నారాయణ మూర్తి, ఎంపిడిఒ శోభారాణి, ఇఒఆర్‌డి ప్రభావతి, పిఆర్ ఎఇ మల్లయ్య, ఉపాధి ఎపిఒ తిమ్మారెడ్డి, ఇసి సూర్య ప్రకాష్, కార్యదర్శి ఇస్రత్ బాష పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం బనవనురు, ములుగుందం, డి.కోటకొండ గ్రామాల్లోని సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు జంప్ల నాయక్, సహారా భాను అధ్యక్షతన 'పల్లె పండగ' నిర్వహించారు. బనవనురు ఎంపిటిసి ప్రభవతమ్మ, ఎంపిడిఒ గీతావాణి పాల్గొని మాట్లాడారు. బనవనురు గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ, సిసి రోడ్లకు రూ.10 లక్షలతో భూమి పూజ చేశారు. ఎపిఒ రామకృష్ణ, ఎపిఎం జనార్ధన, పిఆర్ ఎఇ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి ఉసేని, టిడిపి నాయకులు నబి రసూల్, సూరి, రాజు, చంద్ర పాల్గొన్నారు. **పెద్దకడబూరులో** 'పల్లె పండగ' వారోత్సవాల్లో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహశీల్దార్ శ్రీనాథ్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బలరాముడు చేతులమీదుగా సిసి రోడ్లకు, డ్రెయినేజీలకు భూమి పూజ చేశారు. పిఆర్ ఎఇ ఖాదర్ బాషా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయ్ కుమారి, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు కోడిగుడ్ల ఏసేపు, విజయ్ కుమార్, బొగ్గుల నరసన్న, తలారి అంజి, టిడిపి నాయకులు భీమ్ రాయుడు, కమ్మగిరి పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం దేగలపాడు గ్రామంలో సర్పంచి నీలకంఠ ఆధ్వర్యంలో 'పల్లె పండగ' నిర్వహించారు. ఎంపిడిఒ అల్లా ప్రకాష్, ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఒ జుబేర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి నరసింహులు సమక్షంలో సర్పంచి నీలకంఠ చేతులమీదుగా ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, రెవెన్యూ కార్యదర్శి అంజి, గ్రామ పెద్దలు పోతన్న పాల్గొన్నారు.

కౌతాళంలో భూమిపూజ చేస్తున్న నాయకులు

దేవనకొండ : సిసి రోడ్డుకు భూమి పూజ చేస్తున్న వీరభద్ర గౌడ్

భూమి పూజ చేస్తున్న సర్పంచి, అధికారులు

పెద్దకడబూరులో భూమిపూజ చేస్తున్న నాయకులు

ఆస్పరిలో భూమి పూజ చేస్తున్న ఎంపిడిఒ గీతావాణి, ఎంపిటిసి ప్రభావతమ్మ

నిధులు మంజూరు కాని రోడ్లకు భూమిపూజ

- పూజకు అధికారులు దూరం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండగ'లో నిధులు మంజూరు కాని రోడ్లకు టిడిపి యువ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి చేతులమీదుగా గ్రామ నాయకులు భూమిపూజ చేయించారు. సోమవారం మండలంలోని కలుదేవకుంట గ్రామంలో పంచాయతీ రాజ్ ఎఇ మల్లప్ప చెబుతున్నా కేవలం నాలుగు ఇళ్లు ఉన్న రోడ్లకు కొబ్బరికాయలు కొట్టించారు. గ్రామంలో రెండు రోడ్లకు కలిపి రూ.10 లక్షలు మంజూరు మాత్రమే విడుదలయ్యాయని రోడ్డు లేని చోట భూమి పూజ చేద్దామని, చెప్పిన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని ఎఇ చెబుతున్నా గ్రామ నాయకులు మాత్రం పట్టిన పట్టు వదల్లేదు. అక్కడ అధికారులు మాత్రం దూరంగా ఉండిపోయారు.

కెజిబివిలో నాన్ టీచింగ్ ఉద్యోగ

'భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం'

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని కెజిబివిలో నాన్ టీచింగ్ ఉద్యోగానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఇఒ సావిత్రమ్మ తెలిపారు. సోమవారం ఎంఆర్‌సి కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కెజిబివిలో నాన్ టీచింగ్ (అసిస్టెంట్ కుక్) ఉద్యోగానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఈ ఉద్యోగాన్ని అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 2024-25 విద్యా సంవత్సరానికి భర్తీ చేయడానికి అర్హులైన, ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థుల నుంచి ఈనెల 7 నుంచి 15 వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు చిప్పగిరిలోని విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, సంబంధిత తహశీల్దార్ ద్వారా జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రం జరపరచాలని చెప్పారు. దరఖాస్తులను ఈనెల 16న పరిశీలించి జిల్లా స్థాయి అధికారులకు పంపుతామన్నారు.

మద్యం టెండర్లపై టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రెండు మద్యం దుకాణాలు తమ నాయకులకు టెండర్ల ద్వారా రావడంతో 'తెలుగు తమ్ముళ్లు' సంబరాలు జరుపుకున్నారు. సోమవారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డికి సంబంధించిన వారి పేరు మీద మాధవరం, తుంగభద్ర గ్రామాల్లో నిర్వహించేందుకు లాటరీ పద్ధతితో దుకాణం దక్కిందని టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి బి.వరద రాజులు పేర్కొన్నారు. విద్యాకమిటీ ఛైర్మన్ మద్రి నరసింహ, నాయకులు డిసి.తిమ్మప్ప, శివ, రాఘన్న, డేవిడ్ పాల్గొన్నారు.

సూర్యనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

నగరంలోని శ్రీసూర్య నారాయణ స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కలశోద్వాసన జరిపి అమ్మవారి సన్నిధిలో మేరు శ్రీచక్రానికి షోడశోపచార పూజ, 108 అష్టోత్తర శత కలశాభిషేకం, శ్రీలలితా సహస్రనామ పారాయణం చేపట్టినట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ టి.శివ రామకృష్ణ తెలిపారు.

ఎల్ఐసి నిర్వీర్యానికే ఏజెంట్ల కమీషన్ తగ్గింపు

- లియాఫీ ఎమ్మిగనూరు అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, జయన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎల్ఐసిని నిర్వీర్యం చేయడానికి ఎల్ఐసి ఏజెంట్ల కమీషన్ తగ్గింపు చేశారని లియాఫీ ఎమ్మిగనూరు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, జయన్న, ఆర్థిక కార్యదర్శి వీరేష్, నాయకులు రమేష్, ఆంధ్రయ్య తెలిపారు. సోమవారం భోజన విరామ సమయంలో గంటసేపు బ్రాంచి కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లియాఫీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, జయన్న, వీరేష్, రమేష్, ఆంధ్రయ్య, సోమన్న, సోలమాన్, హరినాథ్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు విజయ్ కుమార్, డెవలప్‌మెంట్ ఉద్యోగుల సంఘం నాయకులు సుధాకర్ రావు మాట్లాడారు. ఏజెంట్లకు పాలసీ ప్రీమియంపై ఇచ్చే కమీషన్ రేట్లు తగ్గించడం శోచనీయమన్నారు. మానవ జీవన ప్రమాణాలు నేటికీ ఎంతో పెరిగాయని, ధరల సూచి ప్రకారం కమీషన్లు పెంచాల్సింది పోయి తగ్గించడం అనాలోచిత నిర్ణయమని విమర్శించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇన్సూరెన్స్ తీసుకోవడానికి మినిమం పాలసీ రూ.2 లక్షల నిర్దేశించడం ద్వారా వారికి ఇన్సూరెన్స్ అందించలేరని తెలిపారు. కరోనా తర్వాత ప్రజల జీవన ప్రమాణాలు దిగజారాయని, మినిమం పాలసీని రూ.లక్షగా నిర్దేశించాలని కోరారు. 55 ఏళ్ల వయస్సున్న వారికి పాలసీలను అందుబాటులో తీసుకురావాలని, పాలసీదారులకు బోనస్ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఏజెంట్ల కమీషన్ తగ్గించడం ద్వారా ఎల్ఐసిని నిర్వీర్యం చేసి ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీలకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డిఎ) అంటకాగుతోందని విమర్శించారు. భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ఏజెంట్లు సంఘటితమై పోరాడాలని కోరారు. ఏజెంట్లు సత్య రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, ప్రసాద్, అబ్దుల్, గఫూర్, ప్రభాకర్, హరినాథ్, గురు రాజ్, నారాయణ, సూర్యకాంత్ రెడ్డి, దేవేంద్రమూర్తి పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

15న సెపక్ తక్రా ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

జిల్లా సెపక్ తక్రా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న ఉదయం 10 గంటలకు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషులు, మహిళలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఈనెల 22, 23న శ్రీకాకుళం జిల్లాలో జరిగే సీనియర్స్ మహిళ, పురుషుల సెపక్ తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 9440257242 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అక్రమ ప్రొఫెసర్లకు ఇంక్రిమెంట్లు దారుణం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో ముగ్గురు అక్రమ ప్రొఫెసర్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వడం దారుణమని ఎస్ఎఫ్ఐ వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. ప్రొఫెసర్లను తొలగించారని, వారికి ప్రస్తుత అధికారులు తొలగించిన సమయానికి జీతం ఇవ్వాలని, వారిని రెగ్యులర్ చేసి వారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలని పాలకమండలిలో చర్చించటం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో బహిర్గతం చేయాలన్నారు. యూనివర్సిటీ అధికారులు వారిని అందలం ఎక్కిస్తూ కీలక పదవులు ఇవ్వటమే కాకుండా వారికి ఇంక్రిమెంట్లతో పాటు జులై 18, 2023 నుంచి ఆగస్టు 25, 2023 వరకు తొలగించిన సమయాన్ని రెగ్యులర్ చేసి జీతమివ్వాలని పాలకమండలి తీర్మానం చేయటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, ఉన్నత విద్యా మండలి ముఖ్య కార్యదర్శి స్పందించాలని డిమాండ్ చేశారు. అక్రమ ప్రొఫెసర్లకు ఇంక్రిమెంట్ల తీర్మానాన్ని రద్దు చేయాలని కోరారు.

వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - సి బెళగల్

వర్షాకాలంలో పంటలను కాపాడుకునేందుకు అధికారుల సలహాలు తప్పనిసరిగా పాటించాలని ఏఓ మల్లేష్ కుమార్ రైతులకు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. జొన్న, సజ్జ, పత్తి, వేరుశనగ, ఉల్లి కోత పనులను ప్రస్తుతం ఆపుకోవడం మంచిదని అన్నారు. అలాగే తుఫాన్ ప్రభావం పూర్తయ్యాక వేరుశనగ, శనగపప్పు వంటివి రబీ సాగులు చేసుకోవాలని రైతులకు సూచించారు.

క్వాలిటీ స్కానింగ్‌కు కేరాఫ్ 'ఆర్బిట్'

- డాక్టర్లు వినయ్, మధుసూదన్

ప్రజాశక్తి - ఆదోని

ఆర్బిట్ డయాగ్నోస్టిక్ సెంటర్

వ్యాధి లక్షణాల నిర్ధారణకు సంబంధించిన రిపోర్టులు క్వాలిటీగా ఇవ్వడంలో ఆర్బిట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పేరు ఉందని డాక్టర్లు వినయ్, మధుసూదన్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ మూడవ రోడ్డులో 2021లో ఆర్బిట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. కంప్యూటర్ ట్రామ్యుగ్రఫీ (సిటి), అల్ట్రా సౌండ్, డిజిటల్ ఎక్స్‌రే అందుబాటులో ఉంద న్నారు. ఎలక్ట్రో కార్డియోగ్రఫీ, కంప్యూటర్ ల్యాబ్ (పాథలజీ) సౌకర్యానికి సంబంధించిన స్కానింగ్ అందుబాటులో ఉందని తెలిపారు. ఆధునిక యంత్రాలతో అవయవ లోపం స్పష్టంగా కనపడే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తమ పర్యవేక్షణలో ఆధునిక యంత్రాలతో, టెక్నాలజీతో కూడిన పరికరాలతో రోగి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఆదోనిలో రోగుల మన్ననలు పొందుతూ సేవలను విస్తరించినట్లు చెప్పారు. ఎమ్మిగనూరు, గుంతకల్లు, బళ్లారి ప్రాంతాల్లో ఆర్బిట్ డయాగ్నోస్టిక్ సెంటర్ ద్వారా డాక్టర్ల పర్యవేక్షణలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగి అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎన్ఎబిఎల్, ఎఇఆర్‌బిల గుర్తింపు పొందిన సంస్థగా ఉందని వివరించారు. త్వరలోనే ఆర్బిట్ సంస్థ ద్వారా మరో సేవ అందుబాటులోకి వస్తోందని డయాగ్నోస్టిక్ సెంటర్ మేనేజర్ సుధాకర్ తెలిపారు. ఇతర వివరాలకు 7013579039 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత

- 3 గంటల్లోనే ఛేదించిన కర్నూలు మూడో పట్టణ పోలీసులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఇంటి నుంచి తప్పిపోయిన ఇద్దరు పిల్లలను కర్నూలు మూడో పట్టణ పోలీసులు క్షేమంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని మారుతి మెగాసిటీ నిధి అపార్ట్ మెంట్ నుంచి ఆరేళ్ల ఎమ్.అభినవ్ రెడ్డి, ఐదేళ్ల సి.హరిచరణ్ రూ.10 నోటు తీసుకొని జామకాయలు కొనుక్కోవడానికి సోమవారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తండ్రి ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లారు. తల్లి గృహిణి ఇంట్లో ఉన్నారు. ఎంతసేపటికీ పిల్లలు ఇంటికి రాలేదని గమనించి కర్నూలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు మూడో పట్టణ సిఐ మురళీ ధర్ రెడ్డి, మూడో పట్టణ ఎస్ఐ మన్మథ విజయ్, పోలీసు బృందాలుగా ఏర్పడి పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో ఆటోడ్రైవర్లకు సమాచారాన్ని చేరవేశారు. కర్నూలు మూడో పట్టణ పరిధిలో ఉండే సి.క్యాంపు ఎంప్లాయీస్ కాలనీ మహిళలు పిల్లలను గుర్తుబట్టారు. ఆ పిల్లలు చదివే మాంటిస్సోరి స్కూల్ ఆటో డ్రైవర్లకు సమాచారం అందించారు. మూడో పట్టణ పోలీసులు, ఆటోడ్రైవర్ల సహాయంతో ఆరోరా నగర్, జమ్మిచెట్టు దగ్గర ఇద్దరు పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగించారు. మూడో పట్టణ పోలీసులను, ఆటో డ్రైవర్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఆటోడ్రైవర్లను మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో శాలువాతో సన్మానించి అభినందించారు. తల్లిదండ్రులు మాటలు వచ్చే చిన్న పిల్లలకు వారి మొబైల్ నెంబర్లు, ఇంటి అడ్రస్, తల్లిదండ్రుల పేర్లు తెలిసే విధంగా తర్ఫీదు, అవగాహన కల్పించాలని తెలిపారు. చిన్నపిల్లలు తప్పిపోకుండా తల్లిదండ్రులకు సంబంధించిన సమాచారాన్ని, మొబైల్ వివరాలు, అడ్రస్ వారి జేబుల్లో ఉంచాలని తెలిపారు.

మల్లికార్జున ఫర్నీచర్ వరల్డ్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్ కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన మల్లికార్జున ఫర్నీచర్ వరల్డ్‌ను సోమవారం రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మల్లికార్జున ఫర్నీచర్ వరల్డ్ యజమాని, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కర్నూలు జిల్లా అధ్యక్షులు నాగేళ్ల రాజగోపాల్ శెట్టి, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఇక్కడ అధునాతన రకాల ఫర్నీచర్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా అన్ని రకాల ఫర్నీచర్ కొనుగోలు మీద 40 శాతం వరకూ డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపారు. తమ వద్ద బజాజ్ ఫిన్‌సర్వ్ ద్వారా ఇఎంఐ ద్వారా కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాలను కర్నూలు నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫర్నీచర్ వరల్డ్‌ను ప్రారంభిస్తున్న టిజి.వెంకటేష్

కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

- ఆరు నెలల బాలుడి కిడ్నీల్లో రాళ్లు తొలగింపు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఆరు నెలల బాలుడి కిడ్నీలోని రాళ్లను లేజర్ ద్వారా తొలగించారు. దానికి సంబంధించిన వివరాలను ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్టు, ఆండ్రాలజిస్టు, లాప్రోస్కొపిక్, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ వై మనోజ్ కుమార్ వెల్లడించారు. 'ఆరు నెలల బాబుకు మూత్రం రాకపోవడం, పొట్ట బాగా ఉబ్బిపోవడంతో బాబు తల్లి, మేనమామ కలిసి ఆస్పత్రికి తీసుకొచ్చారు. బాబు తండ్రి సైన్యంలో పని చేస్తుండడంతో వారిద్దరు వచ్చారు. పరీక్షించగా బాబుకు రెండు కిడ్నీలలో రాళ్లు ఏర్పడి, అప్పటికే దాదాపు కిడ్నీ ఫెయిల్యూర్ పరిస్థితి ఏర్పడింది. దాంతో ముందుగా స్టెంట్లు అమర్చాం. దానివల్ల కిడ్నీలు మళ్లీ మామూలు స్థితికి చేరుకున్నాయి. ఆ తర్వాత ముందుగా ఒకవైపు, తర్వాత మరోవైపు కిడ్నీల్లోని రాళ్లను తొలగించాలని నిర్ణయించాం. ఎడమవైపు కిడ్నీలో 11 మిల్లీమీటర్లు, 9 మిల్లీమీటర్ల రాళ్లు ఉండగా, కుడివైపు కిడ్నీలో 9 మిల్లీమీటర్లు, 7 మిల్లీమీటర్ల చొప్పున రాళ్లు ఉన్నాయి. నిజానికి ఇవి పెద్ద వయసు వారిలో ఏర్పడినా పెద్ద రాళ్లనే చెప్పాలి. వీటిలో ముందుగా ఒకవైపు కిడ్నీకి ఒకసారి, రెండోవైపు కిడ్నీకి ఇంకోసారి ఎండోస్కొపిక్ పద్ధతిలో కుట్లు లేకుండా లేజర్ ద్వారా, ముఖ్యమైన అవయవాలకు గాయాలు కాకుండా జాగ్రత్తగా రాళ్లు తొలగించాం. ఇప్పుడు స్టెంట్లు కూడా తొలగించాం' అని తెలిపారు. కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో ఉన్న అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన నిపుణుల కారణంగానే ఇలాంటివి కూడా చేస్తున్నామని డాక్టర్ మనోజ్ కుమార్ వివరించారు.

కిడ్నీలో రాళ్లు తొలగించిన తరువాత ఆరు నెలల బాలుడు, డాక్టర్ మనోజ్ కుమార్

దళిత మహిళపై వివక్ష సరికాదు

- ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దీక్ష చేపడుతున్న గోవిందమ్మ, దళిత సంఘ నాయకులు

దళిత మహిళ గోవిందమ్మపై అధికార యంత్రాంగం వివక్షత చూపడం ఎంతవరకు సమంజసమని నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో గోవిందమ్మ తలపెట్టిన దీక్ష సోమవారం 13వ రోజుకు చేరింది. ఆమెకు మద్దతుగా ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధికారి ప్రతినిధి జయన్న, జిల్లా నాయకులు గుండుపోగుల రంగన్న అలియాస్ నేపాల్ మాదిగ, నాగేష్, దేవరాజు, సురేష్, జైపాల్, శాంతిరాజు దీక్షల్లో కూర్చున్నారు. గోవిందమ్మకు మద్దతుగా సిపిఐ మహిళా జిల్లా కార్యదర్శి ఈరమ్మ, మహిళా నాయకులు మల్లేశ్వరమ్మ, గోవిందమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళిత మహిళలకు దిశా చట్టాలు వర్తించవా అంటూ ప్రశ్నించారు. దళితుల పట్ల వివక్ష చూపిస్తున్న కలెక్టర్, ఎస్పీ, పోలీసులపై సుప్రీంకోర్టు, హైకోర్టు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

గోవిందమ్మకు మద్దతుగా భారీ ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో దాడికి గురైన దళిత గోవిందమ్మకు న్యాయం జరగాలని పెద్దకడబూరులో దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. దళిత సంఘం నాయకులు యువరాజు, ముక్కరన్న, అర్లప్ప, శాంతిరాజు, ఆనంద్ స్థానిక ఎస్సీ కాలనీ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అసలైన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని కోరారు. బాధిత గోవిందమ్మ కుటుంబానికి రక్షణ కల్పించి, ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. 13 రోజుల నుంచి ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో నిరాహార దీక్ష చేస్తున్న గోవిందమ్మ అనారోగ్యం బారిన పడితే ఎస్పీ, కలెక్టర్ బాధ్యత వహించాలని తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, బిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమరేష్, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు కదిరికోట బతుకమ్మ, సుమాల ఛార్లెస్, మాల మహానాడు నాయకులు మాల నరసన్న, గడ్డం హుసేని, రాజోలప్ప, ఎమ్మిగనూరు జెఎసి నాయకులు పందికొన ఈరన్న, విద్యార్థి సంఘం నాయకులు ఉదయ్, అజిత్, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు సామ్యూల్, బిఎస్ఎస్ నాయకులు ప్రసన్న పాల్గొన్నారు.

గ్రామ సేవకులతో వెట్టి చాకిరి తగదు : సిఐటియు

ప్రజాశక్తి - మద్దికెర

గ్రామ సేవకులతో వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు తెలిపారు. సోమవారం ఆయన మద్దికెరలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ సేవకులు గ్రామంలో అందుబాటులో ఉండి విఆర్‌ఒలకు చేదోడుగా ఉండాలని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయానికి రాత్రి డ్యూటీలు వేసి పని భారం పెంచుతున్నారన్నారు. గ్రామాల్లో రెవెన్యూకు సంబంధించి ఎన్నో పనులు చేస్తున్న వారిపై అదనపు భారం తగదన్నారు. తహశీల్దార్ స్పందించి గ్రామ సేవకులకు రాత్రి డ్యూటీలు లేకుండా చూడాలని కోరారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.